# కలలో వార్తలు

కలలు నిజంకావని నాకు తెలుసు. నా కలలు బొత్తిగా అబద్ధాలు. ఒక కలలో నాకు దారిపొడుగునా చిల్లరడబ్బులు దొరికినై. ఏమయింది? ఏమీ కాలేదు.

కాని రాత్రిగాణ్ణయిన పాపాన కలలు కనటం నాకు వ్యసనమైపోయింది. దానికి తగ్గట్టుగానే నాకు నాకలంమీద ఏమాత్రమూ అధికారంలేదేమో, వాటినిగురించి రాయక తప్పటమూ లేదు.

అందుచేత ... ఇదిగో నాకల. ఇదంతా నిజమవుతుందని ఎవరన్నా నమ్మితే వాళ్ళపాపాన వాళ్ళే పోతారు.

* * *

రైల్లో కాబోలు పోతున్నాను. అది రైలల్లేలేదు. కాని వేగంగా పోతున్నది. పట్టాలు లేవు, టకటక శబ్దంలేదు. నాపక్కనే ఒకాయన పత్రిక చదువుతున్నాడు.

"నిర్దుష్టమైన బడ్జెటు," అని చదివాడు.

"కాస్తపైకి చదవండి బాబూ," అన్నాను.

"నేడు డొమినియను ఎసెంబ్లీలో గ్రిటాప్రివరప్పగారు నిర్దుష్టమైన బడ్జెటు అదివరకెన్నడూ పుట్టి ఉండలేదని వైద్యులు చెప్పుకొనుచున్నారు. ఇది మంత్రిసానుల శక్తులను శోధించగల బడ్జెటు కాన్పు. బడ్జెటు వివరాలు. బడ్జెటు బొడ్డుకోసినాక తొమ్మిదిన్నర పౌనుల బరువున్నది. ప్రసవ వేదన సరిగా నాలుగుగంటల పన్నెండు సెకండ్లు మాత్రమే... పెట్టుబడిమీద ఇదివరలో ఉండిన పన్నులన్నీ ఈ బడ్జెటుతో తొలగించబడ్డాయి. దీనిమూలంగా

పారిశ్రామికులు తమ లాభాలన్నిటినీ తిరిగి పెట్టుబడి చేయటానికే వినియోగ పరుచుకో గలుగుతారు. ప్రభుత్వఖర్చుకు కావలసిన మొత్తం 15 వేల కోట్లున్నూ ఈక్రింది పన్నులద్వారా వసూలు చెయ్యబడుతుంది.

1. పెట్టుబడిలేని ఆదాయంమీద నూటికి యాభై పన్ను.

2. ముష్టి ఎత్తుకొనే పేదప్రజలమీద నూటికి పదివంతులు పన్ను.

3. సినిమా, నాటకం, పత్రిక ప్రణయలేఖ, మీటింగులు, పరిషత్తు సమ్మేళలు మొదలైన వినోదాలమీద నూటికి 80 వంతున పన్ను.

4. ఎన్నికలలో మెజారిటీ తెచ్చుకోలేని పార్టీల సభ్యులమీద మనిషికి నూరురూపాయల చొప్పున పన్ను. (ఇది మద్రాసు కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ ఎన్నికలకుకూడా వర్తిస్తుంది) ఎన్నికలయిన ఇరవైనాలుగు గంటలలోగా కోటుమార్చే వారికి పన్ను ముజరా ఇవ్వబడుతుంది.

5. ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయినవారు డిపాజిట్టు పోగొట్టుకోని పక్షంలో ఆ డిపాజిట్టు పన్ను కింద వసూలు చేయబడుతుంది."

ఇంతవరకు చదివి ఆ పెద్దమనిషి నాతో, "ఈ ప్రజాపత్రికలు రాయటానికేం? నిజం ఆలోచిస్తే ఇది నిర్దుష్టమైన బడ్జెటు కానేకాదు," అన్నాడు.

"ఎందుచేతా?" అన్నాను.

"ఇది కాపిటలిస్టు మీద ఇన్డైరెక్టు టాక్సేషన్. ఉద్యోగాలు చేసుకునే వాళ్ళూ అడుక్కుతినే వాళ్ళూ కట్టేపన్ను పెట్టుబడిదార్ల మీదేఃద పడేది. ఘోరం! ఘోరం!"

"అయితేనేం? పన్నుభారం జాస్తి అయినప్పుడు పారిశ్రామికులు తమ కింద పనిచేసే వారంతా బిచ్చగాళ్ళనని చెప్పి తప్పించుకోవచ్చు. బిచ్చగాళ్ళ పన్ను చాలా తక్కువ కద," అన్నాను.

ఆయన విశాలంగా నవ్వి, "ఆ ఆలోచన నాకూ తట్టింది." అన్నాడు. మళ్ళీ పత్రిక చదవసాగాడు.

"బడ్జెటు మీద మాట్లాడుతూ గ్రీటావరప్పగారు ఈ కింది విషయాలు చర్చించారు. ఈ ప్రభుత్వం యొక్క ఆశయం ఉత్పత్తి పెంచటం – పంచటం కాదు. సభ్యులు పరధ్యానంగా ఆలకించే దురభ్యాసం మానాలి. మన ఉత్పత్తి మన అవసరాలకు పదింతలూ, మన ప్రజల కొనుగోలు శక్తికి నూరింతలూ అయే

వరకూ మనకు ప్రపంచ దేశాల మధ్య తలవంపులే. మనదేశంలో నూటికి 90 మంది అయినా అవసరాలకు మాడి చావకపోతే మనం నలుగురిలోనూ తల ఎట్లా ఎత్తుకు తిరుగుతామో నాకు తెలియటంలేదు. ఈ బడ్జెటును మీరు ఆమోదించినట్టయితే అప్పుడు మన తడాఖా చూపిస్తాను. ఈ బడ్జటు ఎందుకు ఈవిధంగా ఉన్నది. ఉన్న పళంగా పాసు చెయ్యాలో మీకు సంగ్రహంగా మనవి చేస్తాను...దేశంలో ఇన్ని ఏళ్ళు గడిచినా ఇంకా మత వైషమ్యాలు తగ్గటం లేదు. మత సామరస్యంకోసం పాటుపడే వాళ్ళందర్ని జైళ్ళలో తోశాము కాని కార్యం లేకుండా ఉంది. దేశంలో ఉన్న అల్ప సంఖ్యాక మతాల వారిలో కూడా. మత కలహాలకు బలి అయినవారు మిగతా వారిని పైదేశాలకు రవాణా చేశాము. దేశంలో ఏకమత ప్రతిష్ఠాపన చేశాము. అట్లాగూ మతసామరస్యం నెలకొల్పటానికి సాధ్యం కాకుండా ఉంది, మతవిముఖులూ, మతాన్ని తృణీకరించేవారూ ఇంకా దేశంలో ఉండి మతాభిమానులకు కోపం తెప్పిస్తున్నారని చెప్పటానికి నాకు చాలా తలవంపులుగా ఉన్నది. ఈ విషయమై తీవ్రచర్య తీసుకోవలసి ఉంది. మతావేశం లేనివారందర్నీ పట్టుకోవటానికి ఒక ప్రత్యేక పోలీసు శాఖ వేస్తున్నాము. దానికి 500 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నాం. నిజంగా ఈ మొత్తం చాలదు. కాని దీనితోనే పని గడిచేటందుకుగాను మతోన్మాదంలేని వారినందరినీ ఉరి తీసెయ్యటానికి ఏర్పాట్లుచేస్తున్నాం. చట్టం అంత దారుణంగా పెట్టినట్టయితే పోలీసు శాఖకు కొంతపని తగ్గిపోవచ్చును ....రష్యామీదా, తదితర ఫాసిస్టు దేశాలమీదా యుద్ధం చెయ్యటానికి సిద్ధంగా ఉన్న ప్రజా స్వామ్య రాజ్యాలకు ఉచితంగా మరొక అయిదువందల కోట్లు—ఇది సముద్రంలో కాకిరెట్ట— ఇస్తున్నాం ... మన ఉత్పత్తి సరుకు కొన నిరాకరించే దేశాలమీద యుద్ధం చెయ్యటానికి పదివేలకోట్లు ఖర్చున్నది. దీన్ని గురించి సభ్యులలో రెండభిప్రాయాలు లేవని నమ్ముతున్నాను. మిగతా చిల్లర ఖర్చుకుగాను నాలుగువేల కోట్లు అవుతుంది. ఈ నాలుగు కోట్లలోనూ మూడు కోట్లు, లాభాలు చాలక ఉత్పత్తి నిగ్రహిస్తున్న పారిశ్రామికులకు లంచంగా ఇవ్వవలసి ఉంది.

ఇంకా పత్రికలలో బడ్జెటు చర్యకూడా ఉంది. కొందరు సభ్యులు, బడ్జటు నిర్దుష్టంగా లేనప్పటికీ, లాభాలను దొంగపోటు పొడుస్తున్నప్పటికీ, పారిశ్రామికులు దేశ క్షేమంకోసం కొంతత్యాగం చేసి ఈ బడ్జెటును సమర్థించాలన్నారు.

నా ప్రక్క నున్న పెద్దమనిషి ఇంకా చదువుకుపోతున్నాడు. నాకు విసుగెత్తింది. నాకసలే రాజకీయాలంటే మంట. కొందరికి ప్రపంచంలో ఏం జరిగినా అంతా కావాలి. నా కది గిట్టదు. ఎవరిపని వాళ్ళు చూచుకుంటే చాలు. రాజ్యాలు ఏలేవాళ్ళు ఏలుతారు. మిగతావాళ్ళ కెందుకు హడావుడి? నన్నడిగితే వార్తా పత్రికలే ఉండరాదు. వాటి మూలంగానే సహం ఆందోళన.

నాకూ పత్రిక చదివే పెద్దమనిషికే మధ్యలో ఒక మాసపత్రిక కనపడింది. దాని పేజీలు తిరగవెయ్యసాగాను. "సంఘం దేనికి?" అనే ఒకవ్యాసం కనపడింది. అది రాసినవాడు జ్ఞమ్న త్రియ్య ఎం. బి. పి. డి. హెచ్. ఎక్స్. డీ. వై. త్రీ. పీ. హం. (బాగ్) గారు,

ఆవ్యాసంలో మ్నత్రయ్యగాను సంఘమనేది ఒక మూఢ విశ్వాసమని యుక్తియుక్తంగా వాదించాడు. ఏమి టీసంఘం? దీనివల్ల మనకు కలిగిన లాభమేమిటి? ప్రకృతిలో అనేక జీవరాసు లున్నట్లే మనుషులూ ఉన్నారు. ప్రకృతి వ్యక్తులకే ప్రాధాన్యం ఇచ్చి, పరిణామమంతా వ్యక్తులద్వారానే జరిగింది. సంఘం వచ్చి వ్యక్తిని చంపేసింది. మన జ్ఞానులు వ్యక్తికే ప్రాముఖ్యం ఇచ్చారు. ఎవడి మోక్షం వాడు చూసుకోవాలన్నారు. మనుషులు పుట్టింది లగాయతు అపూర్వవ్యక్తు లనిపించుకున్నవారంతా వ్యక్తులే—అంటే సంఘానికి ఎడంగా నిలబడ్డవారే. వారిని సంఘం హతమార్చింది. ఒక అపూర్వ వ్యక్తికోసం అనామకులు నశించుటమనేది ఉత్పత్తిక్రమంలోనే ఉంది. సంఘమను ప్రతిబంధకం లేనట్టయితే మానవజాతిలో ప్రతివాడూ ఒకఅలెగ్జాండరు, ఒక నెపోలియను, ఒకహిట్లరు, ఒకనిచే అయిఉండేవాళ్ళు. సంఘం మానవపరిశ్రమున అరికట్టింది ఒక నీతిచట్టమూ, న్యాయచట్టమూ, నిగబంధాలూ, డిప్రెషనులూ, మానసిక వ్యాధులూ, చెలరేగాయి. సంఘసమస్యలు పరిష్కారం అవుతున్నకొద్దీ పెరిగాయి. న్యాయస్థానాలనూ, నియమాలనూ ప్రకృతి అసహ్యించుకుంటుంది. ప్రతిక్రియకూ సృష్టిలో ప్రతిక్రియ ఉంటూనే ఉంది. న్యాయచట్టాలు ప్రకృతి కేవిధంగా సహకరించాయి? ఒకణ్ణి మరొకడు చంపితే చంపబడ్డవాడు చచ్చినవాడయినాడు. చంపినవాణ్ణి సమాజం ఉరి తీయటంవల్ల అధికంగా అయిన దేమిటి? ఈ దిక్కుమాలిన సంఘంకోసం మతాలూ, యంత్రాలూ, ఉత్పత్తీ, సమ్మెలూ, ఉద్యమాలూ, జైళ్లూ, కొల్పులూ, యుద్ధాలూ—ఇవన్నీ అవసరమయాయి. ఇంతా చేసి సంఘం వీటిని ఉపయోగిస్తున్నదా? లేదు. ఇవే సంఘాన్ని ఉపయోగిస్తున్నాయి. సంఘం అనేది పోవాలన్నాడు మ్నత్రయ్య.

"కళల విషయంలో చూసినట్టయితే సంఘం కళలకు ఎంత అపకారం చేసిందీ స్పష్టంగా తెలిసిపోతుంది. కేవలమూ సంఘసేవకోసమే ఉద్దేశించిన కళలు చాలా చప్పగా ఉంటూవచ్చినై. వ్యక్తిత్వంకూడుకున్న కళలే అత్యద్భుతంగా ఉన్నాయి. ఈ విషయం అనేకశతాబ్దాలుగా విమర్శకులు గ్రహించినప్పటికీ దాని అంతరార్థం గ్రహించలేకపోయినారు" అనికూడా రాశాను.

నేనీ వ్యాసం చదవటం పూర్తిచేసేసమయానికల్లా ఆ పెద్దమనిషి పత్రిక మడిచి పక్కన పెట్టాడు.

"ఆ కనిపించేవేమిటి ?" అన్నాను.

"అవా ? అవి జైళ్ళు."

"అంత పెద్దవా ?" అన్నాను.

"ఏం ? అందులో ఇరవై వేలమంది ఉన్నారు."

"కొద్దిసేపటికింద ఇటువంటి ఇళ్లే చూశాను."

"అవును, ఈ ప్రాంతాల అయిదారు మైళ్లకొక జైలున్నది.

"ఇది జైలని నేను నమ్మలేకుండాఉన్నా. ఆ గొట్టాలూ అవి ఏమిటి?

"అవి ఫ్యాక్టరీలు. జైళ్ళున్నచోట ఫాక్టరీలుండవా ?"

ఉంటాయని నాకు తెలీదు. కాని ఆయన అన్నతరువాత నాకూ తెలిసినట్టే అనిపించింది.

"ఇప్పుడు పరిశ్రమయావత్తు ఖైదీల శ్రమతోనే నడుస్తున్నది."

"అట్లా ఏం"

"ఒక చిక్కు వచ్చింది. మామూలుగా పెట్టుబడిదారీ వేదాంత ప్రకారం పనివాడు స్వేచ్ఛగా తనకూలి అమ్ముకుంటాడు. ఆస్వేచ్ఛను కూలివాళ్ళు దుర్వినియోగపరచి కూలికిరావడం మానేశారు. కూలికి రానివాళ్ళని నిర్బంధించటానికి చట్టం చెయ్యటం సాధ్యం కాకపోయింది. సమ్మెలుచేస్తే కాల్చవచ్చునని శాసనం చేసేసరికి వాళ్ళు అసలు పనికే రావటం మానేశారు. కాని మరోరకం శాసనం చెయ్యటం సాధ్యమయింది. ఏమనిషిగానీ ఏవిధంగా బతుకుతున్నాడో చెప్పలేకపోతే వాణ్ణి జైల్లో వెయ్యవచ్చు. ఈవిధంగా లక్షలకులక్షలు జైళ్ళలోపడ్డారు. వారంతా దమ్మిడీ కూలీలేకుండా పరిశ్ర

ములు నడుపుతున్నారు. తిండిమాత్రం పెట్టి రోజుకు 12, 14 గంటలు పని చేయించటం సాధ్యమయింది. కాని కొంతమంది పెట్టుబడిదార్లు ఈ ఏర్పాటుకు గునుస్తున్నారు. వారి ఉద్దేశంలో స్వేచ్ఛగా వచ్చిన కూలీలే చౌకగా వస్తారట. తిండికూడా సరిగా ఇవ్వకుండా కూలీవాళ్ళని సంపాదించిన పెట్టుబడిదార్లున్నారు మరి.”

ఆయన మాట్లాడుతుంటే నాకు కోపంవచ్చింది.

“నువు నన్ను మోసం చేస్తున్నావు. పెట్టుబడిదార్లను గురించి అభూత కల్పనలుచేస్తున్నావు. నువు ఇందాక పత్రికలో చదివినవన్నీ కూడా అబద్ధాలే. నేను పెట్టుబడిదార్ల నెరుగుదును. వాళ్ళు నా దేశాన్ని దాస్యంలోనుంచి బయటికి తెచ్చారు. వాళ్ళు దేశభక్తులు. కమ్యూనిస్టు పీడనుకూడా వాళ్ళే తొలగించారు. వాళ్ళనుగురించి నా మనస్సు విరచటానికి ప్రయత్నిస్తున్నావు. పెట్టుబడిదారీ విధానాలకే నువు ఎసరు పెడుతున్నావు. నీ నోరు మాట్లాడుతూంటే నొసలు వెక్కిరిస్తూ ఉంది. చూడు నిన్నేంచేయిస్తానో!,, అన్నాను.

ఆయన నావంక అనుమానంగా చూశాడు.

“నీధోరణిచూస్తే నువు భూగర్భంలో నుంచి వచ్చిన కమ్యూనిస్టులాగే ఉన్నావు. నిన్ను నేను పసికట్టలేననుకున్నావా ? చూడు—నిన్నేంచేయిస్తానో ! పోలీసులు నామిత్రులు,” అన్నాడు.

“పోలీసులు నా మిత్రులు !” అన్నాను.

“నామిత్రులు !” అన్నాడు.

“పెట్టుబడిదార్లు మావాళ్ళు !” అన్నాను.

“మావాళ్ళు !” అన్నాడు.

“పోరా కమ్యూనిస్టు” అన్నాను.

“పోరా కమ్యూనిస్టూ !” అన్నాడు.

“దేశద్రోహీ !” అన్నాను.

“పోరా ప్రజాద్రోహీ!” అన్నాడు.

“దొంగముండాకొడక దొరికావు! కమ్యూనిస్టువుకాకపోతే నీకు ప్రజలతో ఏంపని ? చూడునీబతుకేంచేస్తాను ! అని ఆయనమీదికి వురికాను.

ఆయన మాయమైనాడు నేను కాస్తా రైల్లోనుంచి కిందికి పడటం మొదలుపెట్టాను.

*　　*　　*

ఉలిక్కిపడి పక్కలో లేచి కూర్చున్నాను.

ఏం కలఇది ? దిక్కుమాలినకల !

కాని ఇది నిజంకాదు, నాకు తెలుసు. నాకల లేవీ నిజంకావు. నా మిత్రులంతా నా శ్రేయస్సుకోరి నన్ను కలలు కనవద్దనీ, ఎక్కడన్నా ఒక నౌకరీ సంపాదించుమని బుద్ధికలిగి బతకమనీ సలహా ఇస్తూనే ఉన్నారు. నాకే ఓపిక లేకుండా వుంది,

---